క్లుప్తంగా

తిరుచ్చిపై వెంకన్న విహారం



ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా వేకువనే స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. దేవదేవేరులకు కనులపండువగా కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం వైభవంగా ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం ఉభయ దేవేరీ సమేతంగా స్వామివారు తిరుచ్చిపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి పాల్గొన్నారు.

రిక్షాలు.. బండ్లు పంపిణీ



బండ్లు అందిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : మహిళా దినోత్సవం సందర్భంగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం నిరుపేదలకు జీవనోపాధి కోసం మూడు చక్రాల రిక్షాలు, నాలుగు చక్రాలు బండ్లు పంపిణీ చేశారు. యూత్‌హాస్టల్ వద్ద ఏపీ మెప్మా అకౌంటెంట్ శ్రీనివాసులు నాయుడు చేతుల మీదుగా 13 మందికి 9 రిక్షాలు, నాలుగు తోపుడు బండ్లు అందజేశారు. రిసోర్స్ సెంటర్ రాష్ట్ర ప్రతినిధి భాస్కర్, ఫీల్డ్ కో–ఆర్డినేటర్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు



విద్యార్థినులతో ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్ : మహిళా దినోత్సవం సందర్భంగా వారం రోజులుగా జిల్లాలో పోలీసులు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. శనివారం ఈ మేరకు వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎస్పీ హర్షవర్ధన్ రాజు బహుమతులు అందించారు. మహిళాదినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీలత పాల్గొన్నారు.

'అవని' డిపాజిట్‌కు అధిక వడ్డీ

పాకాల : జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో అవని పథకం కింద నగదు డిపాజిట్ చేస్తే అధిక వడ్డీ పొందవచ్చని బ్యాంకు పాకాల బ్రాంచ్ మేనేజర్ ఉషామాధురి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 31వ తేదీ వరకు ఈ పథకం అమలులో ఉంటుందని, రూ.10వేలకు పైబడి డిపాజిట్ చేసుకోవచ్చని వెల్లడించారు. ఈ మేరకు డిపాజిట్‌లకు ఇన్సూరెన్స్ రక్షణ సైతం ఉంటుందని చెప్పారు. సీనియర్ సిటిజన్ మహిళలు అయితే 8.30 శాతం వడ్డీ పొందవచ్చని వివరించారు.

జానపదాలపై అధ్యయనం అవసరం



మాట్లాడుతున్న వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ : జానపద, గిరిజన సాహిత్యాలపై అధ్యయనం చేయాల్సిన అవసరముందని ఎస్‌ఎస్‌యూ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. పురాణాలు, భారతీయ జానపద, గిరిజన సంప్రదాయాలపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ సదస్సు శనివారం ప్రారంభమైంది. వీసీ మాట్లాడుతూ ఆధునిక తరానికి సంప్రదాయం, సంస్కృతి విశిష్టతను తెలియజేయాలని సూచించారు. కన్నడ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రొఫెసర్ పురుషోత్తం మాట్లాడుతూ జానపద సాహిత్యాన్ని సంరక్షించాల్సిన బాధ్యత యువతరంపై ఉందన్నారు. రాష్ట్రపతి పురస్కార గ్రహీత సాహిత్య శాస్త్ర ప్రొఫెసర్ రామసూర్యనారాయణ, కాలికట్ యూనివర్సిటీ జానపదసాహిత్య విభాగ ప్రొఫెసర్ రాఘవన్ పయ్యానాడ్, ప్రొఫెసర్ ఎస్ భక్తవత్సల రెడ్డి, డాక్టర్ డి నల్లన్న, బి కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే వర్సిటీలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. లాల్ బహదూర్ శాస్త్రి జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ మురళీ మనోహర్ పాఠక్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. మహిళలను సత్కరించారు. సీతామహాలక్ష్మి, కౌశికి పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్‌ను ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు ఆవిష్కరించారు. శనివారం ఈ మేరకు ఏఐటీయూసీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డుతోపాటు పలు డిమాండ్లపై ఈ నెల 28వ తేదీన ఢిల్లీలో ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

వనితా వందనం



తిరుపతి బస్టాండ్‌లో..



రాస్ కార్యాలయంలో..



కస్తూర్బా ట్రస్ట్‌లో..



ఈఎస్ఐ ఆస్పత్రిలో..

విలువలతో కూడిన ఉన్నత సమాజ నిర్మాణం మహిళలతో సాధ్యం.. అన్ని రంగాల్లో రాణించే సత్తా వారికే సొంతం.. ఆడపడుచులు ఆర్థిక సాధికారత సాధించాలి.. పూర్తిస్థాయి ఆధిపత్యం ప్రదర్శించాలి.. దేశాభివృద్ధికి దశ దిశా నిర్దేశించాలి.. పోటీ ప్రపంచంలో దీటుగా ప్రతిభను కనబరచాలి" అంటూ పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శనివారం తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. వివిధ రంగాల్లో విశేష సేవలందించిన అతివలను సత్కరించారు.

– తిరుపతి అర్బన్/ తిరుపతి తుడా/ తిరుపతి సిటీ/ తిరుపతి రూరల్/ తిరుపతి కల్చరల్



ఆర్టీసీ అలిపిరి డిపోలో..



వెలమ వెల్ఫేర్ సంఘం ఆధ్వర్యంలో..



రంగస్థలి ఆధ్వర్యంలో..



ఎస్వీ మెడికల్ కళాశాలలో..



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో..



చిగురువాడలో..

'ఓటేరు' ఆక్రమణపై ఆగ్రహం

- కబ్జాదారులపై వెల్లువెత్తిన విమర్శలు
- వామపక్ష నేతల నిరసన
- జనసేన నాయకుల మండిపాటు

తిరుపతి రూరల్ : మండలంలోని అవిలాల రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబర్ 370, 376, 377లో ఉన్న 36.34 ఎకరాల ఓటేరు చెరువును ఆక్రమించేందుకు యత్నించడంపై పలువురు మండిపడుతున్నారు. శనివారం ఈ మేరకు సీపీఐ, సీపీఎం నేతలతో కలసి జనసేన నాయకులు ఆందోళన చేపట్టారు. చెరువును కబ్జా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అక్రమార్కులకు సహకరించే రెవెన్యూ అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. హెచ్చరిక బోర్డును సైతం ధ్వంసం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు వామపక్ష నేతలు చెరువు వద్ద నిరసన తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ కబ్జాకు సహకరిస్తున్న అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని స్పష్టం చేశారు. చెరువు పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టకుంటే పేదలకు పంచి గుడిసెలు వేయిస్తామని హెచ్చరించారు. సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు అది చెరువు కాదు, తమ భూమి అని చెబుతుంటే ఆయనపై ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఓటేరు చెరువును కాజేస్తున్నారని పత్రికల్లో వార్తలు వస్తున్నా.. అధికారులు ఎందుకు స్పందించడం లేదని మండిపడ్డారు. జనసేన నేత బీగాల చంద్రమౌళి మాట్లాడుతూ చెరువు ఆక్రమణను అడ్డుకోకుంటే ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.



ఓటేరు చెరువు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కమ్యూనిస్టు పార్టీల నేతలు

ఆక్రమిస్తే ఆమరణ దీక్ష



ఓటేరు చెరువును ఆక్రమిస్తే ఆమణ దీక్షకు దిగుతా. ప్రాణం పోయినా సెంటు భూమి కూడా కబ్జాకాకుండా కాపాడుకుంటా. ఈ విషయం ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళతా. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కూడా ఓటేరు చెరువును కాపాడారు.

– దేవర మనోహర్, జనసేన చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి

మా సొత్తు కాజేస్తున్నారు



తిరుచానూరు నుంచి ఓటేరు చెరువుతోపాటు అవిలాల వరకు సుమారు 314 ఎకరాలకు పైగా మా పూర్వీకుల ఆస్తులు వున్నాయి. అందులో మా వాటా కింద వారసత్వంగా 50 ఎకరాలు వచ్చాయి. కబ్జాదారులు మా సొత్తు కాజేస్తున్నారు.

– జీడీఎం ప్రసాద్, తిరుచానూరు.

నగరంలో నేడు

- వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి చేతులమీదుగా పద్మావతిపురంలోని ఆయన నివాసంతో ఉదయం 9 గంటలకు ఫీజు పోరు పోస్టర్ ఆవిష్కరణ
- టీటీడీ పరిపాలన భవనం వెనక మైదానంలో ఉదయం 9 నుంచి టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు
- జాతీయ సంస్కృత వర్సిటీలో ఉదయం 10 గంటలకు జాతీయ సదస్సు
- సీపీఎం ఆధ్వర్యంలో సుందరయ్య నగర్ వద్ద ఉదయం 8 గంటల నుంచి ప్రజా సమస్యల సేకరణ

8మంది అరెస్ట్

తిరుపతి మంగళం : శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాల పరిధిలోని అడవిలోకి చొరబడుతున్న 8 మందిని టాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితులను తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

అర్హులందరికీ పదవులు

తిరుపతి రూరల్ : వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గంలో పలువురు నేతలకు పార్టీ పదవులు దక్కాయి. నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సిఫార్సు మేరకు పార్టీ కోసం కష్టపడుతున్న అర్హులందరికీ పదవులను కట్టబెట్టారు. శనివారం ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి విడుదలైన ప్రకటన ప్రకారం చంద్రగిరి నియోజకవర్గ స్థాయి పలు విభాగాల అధ్యక్షుల వివరాలు..

యువజన విభాగం :	కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి	వాణిజ్యవిభాగం :	బోడిరెడ్డి నిరంజన్ రెడ్డి
మహిళా విభాగం :	మొక్కల భారతి	వెల్ఫేర్ విభాగం :	ఎస్.శివలక్ష్మి
రైతు విభాగం :	వి.భాస్కర్ నాయుడు	మేధావుల విభాగం :	ఎ.దామోదర్ రెడ్డి
బీసీ సెల్ :	వై.చెంచుమోహన్ యాదవ్	వైఎస్సార్‌టీయూసీ :	జి.శివశంకర్ రాజు
ఎస్సీ సెల్ :	కె.సెల్వం	అంగన్‌వాడీ విభాగం :	వి.యశోదమ్మ
ఎస్టీ సెల్ :	బి.రమేష్ నాయక్	లీగల్‌సెల్ :	ఎం.చంద్రశేఖర్ రెడ్డి
మైనారిటీ సెల్ :	ఎస్.వల్లీబాషా	కల్చరలర్ విభాగం :	కె.పవన్‌కుమార్ రెడ్డి
క్రిస్టియన్ మైనారిటీ సెల్ :	బత్తల గోపి	సోషల్ మీడియా విభాగం :	ఎస్.సెంథిల్ కుమార్
విద్యార్థి విభాగం :	బి.చెంగల్‌రెడ్డి	ఐటీ విభాగం :	జి.సుమంత్ రెడ్డి
పంచాయతీరాజ్ విభాగం :	మూలం చంద్రమోహన్ రెడ్డి	పబ్లిసిటీ విభాగం :	తుంటి సుధాయాదవ్
ఆర్‌టీఐ విభాగం :	బడి వెంకటేష్ యాదవ్	డాక్టర్స్ విభాగం :	బీబీ ఆనందప్రసాద్ రెడ్డి
వలంటీర్ల విభాగం :	టి.గిరిధర్ రెడ్డి	బూత్ కమిటీ విభాగం :	విడుదల మాధవరెడ్డి
గ్రీవెన్స్ సెల్ :	పీఎం లక్ష్మీనారాయణ	దివ్యాంగుల విభాగం :	ఎస్.నాగరాజా

దళిత ఉద్యోగులపై వివక్ష

తిరుపతి కల్చరల్ : కార్యనిర్వాహక వ్యవస్థలపై రాజకీయ జోక్యం మితిమీరడంతో దళిత ఉద్యోగులపై వివక్ష పెరిగిందనిఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతమాకుల పుణ్యమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఈ మేరకు ముఖ్యమంత్రికి రాసిన లేఖను ప్రెస్‌క్లబ్‌లో ప్రదర్శించారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా పాలన అందించాలని పేర్కొన్నారు. తిరుపతి కార్పొరేషన్‌లో దళిత ఉద్యోగి కె.లక్ష్మీదేవికి అర్హత ఉన్నా అధికారులు ప్రమోషన్ కల్పించకపోవడం దారుణమని మండిపడ్డారు. దీనిపై సీఎం స్పందించి న్యాయం చేయాలని కోరారు. నేతలు రెడ్డెప్ప, సురేష్, రామూర్తి, పార్వతి, మధు, శివాజీ పాల్గొన్నారు.

'ఫీజు పోరు'పై సమీక్ష

తిరుపతి రూరల్ : వైఎస్సార్‌సీపీ ఈ నెల 12వ తేదీన చేపట్టనున్న ఫీజు పోరు కార్యక్రమంపై శనివారం తుమ్మలగుంటలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమీక్షించారు. పెద్దసంఖ్యలో విద్యార్థులను సమీకరించాలని, కలెక్టరేట్‌కు తీసుకురావాలని సూచించారు. పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, నేతలు ఓబుల్ రెడ్డి, చెంగల్ రెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, సెంథిల్ కుమార్, వినోద్, వీర, నాగేంద్ర, సింగం తేజ పాల్గొన్నారు.



సూచనలిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

డ్రాయింగ్‌లో 'వీక్ష ద స్కూల్' ప్రతిభ

తిరుపతి సిటీ : రెడ్ ఎఫ్ఎమ్ కిడ్ ఫెస్ట్ ప్రోగామ్‌లో భాగంగా శిల్పారామంలో నిర్వహించిన డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలెల్ల వీక్ష ద స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారు. శనివారం ఈ మేరకు సత్తా చాటిన విద్యార్థులు పూర్విక, నైసిక, వేద హర్షిత రెడ్డితోపాటు పలువురు పిల్లలను స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి అభినందించారు.



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ఆర్‌డీఓ ఆదేశాలు బేఖాతర్!

చంద్రగిరి : ఇసుక, గ్రావెల్ అక్రమ తరలింపును ఉపేక్షించ వద్దని, వాహనాలను వెంటనే సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని ఆర్డీఓ రామ్మోహన్ జారీ చేసిన ఆదేశాలను సిబ్బంది బేఖాతర్ చేస్తున్నారు. చంద్రగిరి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించి అధికారులకు స్పష్టంగా ఆదేశించారు. అయితే 24 గంటలు కూడా పూర్తి కాకముందే ఇసుకాసురులు మరో మారు అక్రమ తవ్వకాలు.. తరలింపునకు పాల్పడ్డారు. శనివారం మండల పరిధిలోని శానంబట్ల స్వర్ణముఖి నదిలో హిటాచీ సాయంతో యథేచ్ఛగా ఇసుక తవ్వేసి, ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. అయితే గ్రామంలోని ఓ ఇంటి నిర్మాణానికి ఇసుకను తరలిస్తున్నామంటూ రెవెన్యూ అధికారులను బురిడి కొట్టించే ప్రయత్నం చేశారు. ఇందుకోసం భారీ హిటాచీను తీసుకురావాల్సిన అవసరం లేదని స్థానికులు మండిపడుతున్నారు.



శానంబట్ల సమీపంలోని హిటాచీ ద్వారా ఇసుక తవ్వుతున్న దృశ్యం

ప్రజా సమస్యలపై 'యాత్ర'

తిరుపతి కల్చరల్ : ప్రజా సమస్యలపై శనివారం సుందరయ నగర్ నుంచి సీపీఎం నేతలు చైతన్యయాత్ర ప్రారంభించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఏవీ నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం పోరాటం చేపడతామని వెల్లడించారు. ఈనెల 17వ తేదీ వరకు యాత్ర కొనసాగుతుందని వెల్లడించారు. అనంతరం ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు వందవాసి నాగరాజు, వేణుగోపాల్, టి.సుబ్రమణ్యం, మాధవ్, జయచంద్ర, సాయిలక్ష్మి, జయంతి, బుజ్జి, మల్లికార్జునరావు, రామకృష్ణ, బాలాజీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నేతలు

పురంధేశ్వరికి సత్కారం

తిరుపతి గాంధీ రోడ్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరిని శనివారం ఆ పార్టీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. మహిళా దినోత్సవం సందర్భంగా పద్మావతి అమ్మవారి చిత్రపటం అందించారు. ఈ క్రమంలోనే మోకాలికి శస్త్రచికిత్స చేయించుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రారెడ్డిని పురంధేశ్వరి పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, నేతలు శాంతారెడ్డి వెంకటముని, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, లోక, ప్రభాకర్ నాయుడు, రాజశేఖర్ రెడ్డి, వరప్రసాద్, పొన్నగంటి భాస్కర్, అజయ్ కుమార్, మునిసుబ్రమణ్యం అశోక్, పాల్గొన్నారు.



పురంధేశ్వరిని సన్మానిస్తున్న నేతలు

వైన్‌షాపు తొలగించాలని ధర్నా

తిరుపతి రూరల్ : సాయినగర్ పంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేసిన వైన్ షాపును వెంటనే తొలగించాలని మహిళలు ఆందోళన చేపట్టారు. శనివారం ఈ మేరకు మద్యం దుకాణం ఎదుట బైఠాయించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వైన్ షాపును మార్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



నినాదాలు చేస్తున్న మహిళలు

2,251 కేసుల పరిష్కారం

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం చేపట్టిన జాతీయ లోక్ అదాలత్ లో 2,251 కేసులు పరిష్కారించినట్లు మూడో అదనపు జిల్లా జడ్జి ఎం. గురునాథ్ తెలిపారు. అదాలత్‌లో పదో అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి సునీత రాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ ,జూనియర్ సివిల్ జడ్జిలు సత్యకాంత్ కుమార్, కోటేశ్వరరావు, గ్రంధి శ్రీనివాస్, సంధ్యారాణి, సరిత పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో జడ్జి గురునాథ్

పాకాలలో 82 కేసులు

పాకాల : స్థానిక కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 82 కేసులు పరిష్కారించినట్లు న్యాయమూర్తి శ్రీనివాస్ వెల్లడించారు.